క్లుప్తంగా

రేపు స్పాట్ కౌన్సెలింగ్

వెల్దండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఈ నెల 6న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు స్వర్ణ రత్నం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో 5 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, మైనార్టీ, ఈబీసీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

నాగర్‌కర్నూల్: మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన ఏడల వెంకటమ్మ మృతి చెందడంతో బుధవారం బాధిత కుటుంబానికి మారేపల్లి సురేందర్ రెడ్డి ట్రస్టు సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పేదలకు అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో నాలుగు రోజుల కిందట ఆత్మహత్య చేసుకున్న కొండపల్లి కృష్ణయ్య కుటుంబాన్ని బుధవారం బీజేపీ మహిళా మోర్చా అధికార ప్రతినిధి లావణ్య పరామర్శించారు. శివకుమార్ ఫౌండేషన్ సమకూర్చిన రూ.10 వేలను అందజేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

కల్వకుర్తిరూరల్: జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఫుట్‌బాల్ క్రీడాకారులకు బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ నెల 9న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించే బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. కోచ్‌లు నాగరాజు, వెంకట్రాములు, ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు చందు ముదిరాజ్, సదానందంగౌడ్, మోహన్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కొల్లాపూర్ రూరల్: బీఆర్ఎస్ నాయకుడు సీతారాంనాయక్ మృతి బాధాకరమని పార్టీకి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సున్నపుతండాలో నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే హాజరై పాడె మోశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కాటం జంబులయ్య, శంకర్‌నాయక్, మండల అధ్యక్షుడు రామచంద్రం, తదితర నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుపై హర్షం

కల్వకుర్తిరూరల్: సీఎంఆర్ వడ్ల విషయంలో హైకోర్టు తీర్పు హర్షణీయమని తెలంగాణ మానవహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ విషయంలో కోర్టు తీర్పు రైస్ మిల్లర్లకు ఊరటనిచ్చిందన్నారు. హైకోర్టు తీర్పును గౌరవించి అధికారులు మిల్లర్లను ఇబ్బందులు పెట్టొద్దన్నారు. సీఎంఆర్ సకాలంలో చెల్లించని మిల్లులను మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెడుతామని, ఆస్తులను అటాచ్ చేస్తామని హెచ్చరించడం సరికాదని హైకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.

బ్యాంకు ఎదుట వృద్ధుల పడిగాపులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట బుధవారం వృద్ధాప్య, వితంతు పింఛన్ డబ్బుల కోసం ఇబ్బందులు పడ్డారు. రుణమాఫీ కావడంతో రైతులు అధికంగా బ్యాంకులో బారులు తీరారు. దీంతో పింఛన్ డబ్బులు తీసుకునేందుకు వచ్చిన వృద్ధులకు తిప్పలు తప్పడం లేదు. గంటల తరబడి పడిగాపులు కాశారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని తిరుమలాపూర్, నక్కలపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులు అవస్థలు పడ్డారు.

దరఖాస్తు చేసుకోండి

ఉప్పునుంతల: వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే యువజన సంఘాలు, కాలనీవాసులు అనుమతుల కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌ఐ లెనిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడి పేరు, అడ్రస్, యువజన సంఘం పేరు, మండపం ఏర్పాటుచేసే స్థలం, స్థలం యజమాని పేరు, విగ్రహాలను ప్రతిష్ఠించే తేదీ, నిమజ్జనం చేసే తేదీలతో సమగ్రంగా వివరాలు పొందుపర్చాలని కోరారు. అనుమతులు లేకుండ గణేష్ మండపాలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

అచ్చంపేట రూరల్: డిండి వాగులో చిక్కుకున్న చెంచు కుటుంబ సభ్యులను పోలీస్ కానిస్టేబుల్ రాందాసు చాకచక్యంగా వ్యవహరించి సురక్షితంగా కాపాడాడు. ఈమేరకు బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో రాందాసును సీఐ రవీందర్, ఎస్‌ఐ రాము సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జిలాని, కానిస్టేబుల్స్ విశ్వనాథం, మల్లేష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కొల్లాపూర్: సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని, రామాపురం శివారులోగల ఎంసీహెచ్ ఆస్పత్రిని, డయాలసిస్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రిలోని ఓపీ రికార్డులు, ఉద్యోగుల హాజరుపట్టికలను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనుల గూర్చి ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, అధికారులు ఉన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఆయిల్‌పాం సాగుకు రాయితీ

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ రాయితీలు కల్పిస్తుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని గన్యాగులలో రైతు ఎద్దుల నర్సింహారెడ్డి సాగు చేసిన 18 ఎకరాల ఆయిల్‌పాం తోటను హార్టికల్చర్ అధికారులతో కలిసి పరిశీలించారు. సాగు వివరాలు, వచ్చే లాభాలపై హార్టికల్చర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగులో తక్కువ పెట్టుబడిలో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. 30 ఏళ్ల పాటు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి జగన్, నాగర్‌కర్నూల్ డివిజన్ అధికారి చంద్రశేఖర్, కొల్లాపూర్ డివిజన్ అధికారి లక్ష్మణ్, ఎంపీడీఓ కోటేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు



అచ్చంపేట రూరల్: గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ మాధవి, సీఐలు రవీందర్, శంకర్, ఎస్‌ఐలు రాము, గురుస్వామి, లెనిన్, విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు, ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో వరుస పండుగల దృష్ట్యా శాంతికమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండపం ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి, వెల్దండ సీఐలు నాగార్జున, వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌ఐలు మహేందర్, మాధవరెడ్డి, వీరబాబు, వెంకట్‌రెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, మున్సిపల్, ఫైర్ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మట్టి గణపతులు ప్రతిష్ఠిద్దాం



కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్: పర్యావరణం కాపాడుకునేందుకు మట్టి గణపతులను పూజిద్దామని మున్సిపల్ కౌన్సిలర్ మంజుల అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ మట్టి గణపతులను అందజేశారు. రసాయనాలతో తయారు చేసిన వినాయకులతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బావండ్ల మధు, వీరారెడ్డి, విష్ణువర్ధనాచారి, ఆంజనేయులు, మల్లేష్ యాదవ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యాదానం గొప్పది



నాగర్‌కర్నూల్‌రూరల్: సమాజంలో అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తేజ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జీహెచ్‌ఎం వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వెంకట్‌రెడ్డి దంపతులను సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, నాయకులు మల్లికార్జున్, సురేఖ, శేఖర్, డీఈఓ గోవిందరాజులు, భాస్కర్‌గౌడ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం జరగకుండా చర్యలు



నాగర్‌కర్నూల్: వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ మోటర్లు పంప్‌హౌస్ నీట మునగడం దురదృష్టకరమని వెంటనే మోటర్లకు నష్టం వాటిల్లకుండా నీటిని తొలగించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం శ్రీపురం టర్నల్ వద్ద నీరు ప్రవాహాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ ఈఈ పార్థసారథితోపాటు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి సంఘటనపై పూర్తిస్థాయిలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ పంప్ హౌస్ లో నీరు చేరిందని వెంటనే అధికారులు గుర్తించి నీటిని తొలగించే పనులను ముమ్మరం చేశారన్నారు. కార్యక్రమంలో ఈఈ రవీందర్, డిప్యూటీ ఈఈలు భాగయ్య, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

వంతెనలను నిర్మించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: కేసరి సముద్రం అలుగు ప్రాంతంలో వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు కాళ్ల నిరంజన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంతెన నిర్మించకపోవడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. వరద ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు గుర్తించి వంతెనలు నిర్మించాన్నారు. కుంభం మల్లేష్‌గౌడ్, మేశ లక్ష్మయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


ఫర్టిలైజర్ దుకాణంలో చోరీ

తెలకపల్లి: మండల కేంద్రంలోని చెతాసి ఫర్టిలైజర్ దుకాణంలో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫర్టిలైజర్ దుకాణంలో సీసీ టీవీ కెమెరాలను ధ్వంసం చేసి దుకాణంలో చొరబడి రూ.16వేల నగదు, సీసీటీవీ హార్డ్‌డిస్క్‌ను దొంగిలించారు. ఫర్టిలైజర్ షాపు యజమాని కొత్తపల్లి మధుకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాలుర వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులకు ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తక్షణం కాస్మోటిక్, మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చరణ్, చందులాల్, నవీన్, సాయి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ ఏపీఎం నిరంజన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సంఘాల ద్వారా అనేక పథకాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా శక్తిలో డెయిరీ, బ్యాక్ అండ్ ఫౌల్ట్రీ, రాజశ్రీ కోళ్ల పెంపకం, మదర్ యూనిట్, చిన్న కోడిపిల్లల తయారీ, మీ సేవా, క్యాంటీన్, స్టిచ్చింగ్ కేంద్రం, న్యూ ఎంటర్‌ప్రైజెస్, సోలార్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి యూనిట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలిగా అర్చన, కార్యదర్శిగా రేణుక, కోశాధికారిగా అమృత, ఉపాధ్యక్షురాలిగా బాలచ్చమ్మ, కార్యదర్శిగా గాయత్రిలను ఎన్నుకునట్లు పేర్కొన్నారు. సీసీలు సుజాత, నిరంజన్, కుర్మమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బల్మూర్: మండలకేంద్రంలోని రెండవ, ఐదవ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పోషణమాసం అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ దమయంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ పార్వతి, సూపర్‌వైజర్ నిర్మల, టీచర్లు సునీత, నిలాబాయ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాడూరు: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వనజ అన్నారు. బుధవారం మండలంలోని అల్లాపూర్ 2వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసం వేడుకల్లో ఆమె హాజరై గర్భిణులకు, బాలింతలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యదర్శి వినోద్, అంగన్‌వాడీ వర్కర్ శారద, వెంకటమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బల్మూరు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య నాగర్‌కర్నూల్ నుంచి తెలకపల్లికి బైక్‌పై వస్తున్నాడు. నాగర్‌కర్నూల్ నుంచి శ్రీశైలానికి బైక్‌పై ప్రవీణ్, సాయికృష్ణలు వెళ్తున్నారు. తెలకపల్లి గ్రామ సమీపంలోని మహాత్మాజ్యోతిరావుపూలే బాలుర పాఠశాల వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తిరుపతయ్యకు కాలు విరగగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



తెలకపల్లి: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస అయ్యి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్, డాక్టర్ సంధ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శివగంగ ఫంక్షన్ హాల్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో 'మత్తుకు చిత్తవుతున్న యువత' అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శంకర్‌గౌడ్, దేశమోని ఆంజనేయులు, సీఎల్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్ రెడ్డి, కేకేరెడ్డి ప్రిన్సిపాల్ బాలు, తిరుపతయ్య, పరశురాం, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన

తాడూరు: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు బురదమయంగా మారిని అధికారులు మరమ్మతు చేయకపోవడంతో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని అల్లాపూర్‌లో తాళ్లపల్లికి వెళ్లే రోడ్డును మండల కార్యదర్శి అంతటి కాశన్న పరిశీలించి అక్కడే నిరసన తెలిపారు. రోడ్డు పూర్తిగా బురదమయంగా ఉండటంతో కాలినడకన వెళ్లేందుకు కూడా వీలులేకుండా పోయిందని వాపోయాడు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వార తాత్కాలికంగా మట్టితో గుంతలను పూడ్చాలన్నారు. అదే విధంగా గుట్టలపల్లి, వెంకటపూర్, పాలుమూరు గ్రామాలకు ఉన్న లింకు రోడ్లు నక్ష ప్రకారం ఉపాధి హామీ ద్వార ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాలయ్య, మధు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, పంట నష్టపరిహారాన్ని ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మల్కాపూర్‌లో పత్తి పంటలను పరిశీలించారు. అనంతర ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న, వరి, పత్తి, మిర్చి పంటలు వరద ధాటికి కొట్టుకుపోయాయన్నాడు. వ్యవసాయ శాఖ సర్వే నిర్వహిచి జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలు సేకరించాన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు గౌడ్, వెంకటేష్, శేఖర్, బాలచంద్రయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తెలకపల్లి: వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దూరు, పెద్దపల్లి, గౌరెడ్డిపల్లి, మదనాపురం గ్రామాల్లో ఆయన పర్యటించి పంటలను పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేశవులుగౌడ్, మండల కార్యదర్శి రవీందర్, జిల్లా సమితి సభ్యుడు బండి లక్ష్మీపతి, రైతులు లింగం, బిచ్చల్, కుర్మయ్య, శివకృష్ణ, సుధాకర్, బండి శ్రీను పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో వరి, పత్తి తదితర పంటలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు పరిశీలించారు. రైతు సంఘం నాయకులు కిష్టయ్య, బొందయ్య, నరేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలయ్య, వెంకటస్వామి, బుధవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మాలిక్, నాయకులు ఉన్నారు.

పట్టణ సుందరీకరణకు కృషి



అచ్చంపేట: పట్టణ సుందరీకరణకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ సభ్యులు లేవనెత్తారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో సమస్యలు విడతల వారీగా పరిష్కరిస్తామని, ఇందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు. రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను గుర్తించి, వాటికి తాత్కాలిక మరమ్మతు చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వచ్చేలా కృషి చేస్తునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, వైస్ చైర్మన్ పోరెడ్డి శైలజ, కౌన్సిలర్లు గౌరిశంకర్, మనుప్రసాద్, ఆకుల లావణ్య, తగురం శ్రీనివాసులు, రమేష్‌రావు, అతటి మల్లేష్, సోమ్లానాయక్, గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్, ప్రైవేట్ పాఠశాలలను ఎంఈఓ భాస్కర్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఉపాధ్యాయులు రఫీ, కరుణాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలోని యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నోముల ఆనంద్‌గౌడ్ చెంచులకు మాజీ సర్పంచ్ చత్రునాయక్‌తో కలిసి 25 కుటుంబాలకు బుధవారం దుప్పట్లు, చాపలు అందజేశారు. నాయకులు కర్నాటి శ్రీను, జుల్యానాయక్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు సేకరణ



వెల్దండ: రుణమాఫీ కాని రైతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికల్లో రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను అధికారులు నమోదు చేసి సెల్ఫీ ఫొటోలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఏఈఓలు సురేష్, గణేష్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ధరణి పోర్టల్ ఎత్తేయాలని ధర్నా

తాడూరు: ధరణి పోర్టల్ ఎత్తేయాలని కోరుతూ డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భరత్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాల కారణంగా పైరవీకారులు పెత్తనం అధికం అయ్యిందని ఆరోపించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో భూసమస్యలు పేరుకుపోయాయన్నారు. మండలంలోని సర్పవాడ సర్వే నెంబర్ 263, 264, 270, 297 నంబర్లలో 20 ఎకరాల పట్టాపాలం నిజమైన రైతులది గల్లంతు కావడంతో రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించడం లేదన్నారు. 272 సర్వే నంబర్‌లో ఎకరా పొలం మరొకరి పేరుమీద పడి నిజమైన హక్కు దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు పరిశీలించి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వివరాలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ అలీకి అందజేశారు. రైతులు బాలు, చంద్రయ్య, వెంకటయ్య, పార్వతమ్మ, దేవేందర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



తాడూరు: మండల కేంద్రంలోని ఉమా భోగలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన, పుష్పార్చన నిర్వహించారు. నెల రోజుల నుంచి ప్రతి నిత్యం సహస్ర పుష్పార్చన, అష్టోత్తర శత బిల్వార్చన, రుద్రాభిషేకం నిర్వహించినట్లు పూజారి జంగం శంకరయ్య తెలిపారు. ముగింపు సందర్భంగా మహానివేదన, మంగళ నిరాజనం, వీరభద్ర ఖడ్గ సమావళి పూజలు, మహామంత్ర పుష్పం, ఆలయ ప్రదక్షణ, ప్రత్యేక కైంకర్యాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన స్వప్న ఆంజనేయులు దంపతులు అన్నప్రసాదం వితరణ చేశారు. డాక్టర్ విశ్వనాథ శాస్త్రి, విశ్వేశ్వరయ్య, మల్లికార్జున శాస్త్రి, వినయ్‌కుమార్‌శాస్త్రి, శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, శివకుమార్, శాంతికుమార్, అర్చకబృందం పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

మన్ననూర్: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఈ నెల 6న ఆయుర్వేద ఆస్పత్రి మన్ననూర్ వారి ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి జాన్సన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

పంటల వివరాలు సేకరించాలి



కోడేరు: వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఆయా గ్రామాల ఏఈఓలను కోరారు. బుధవారం మండల కేంద్రంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈఓలు తప్పనిసరిగా పొలాల వద్దకు వెళ్లి నష్టపోయిన ప్రతి రైతు వివరాలు సేకరించాలన్నారు. అనంతరం కోడేరు రైతు వేదికలో పంటరుణాలు మాఫీ కాని రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతి చిన్నారికి క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు అందిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. రవికుమార్ నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నాగర్‌కర్నూల్-ఏ సబ్ సెంటర్, ఉయ్యాలవాడ సబ్ సెంటర్లలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు ప్రతి చిన్నారిని వ్యాక్సినేషన్ సెంటర్‌కు తీసుకొచ్చి టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, పర్యవేక్షణ అధికారి ఫసియొద్దీన్, ఏఎన్‌ఎంలు కవిత, జ్యోతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



కొల్లాపూర్: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఆర్‌వీఎస్‌ఎస్ మిధున్‌తేజ సూచించారు. బుధవారం కొల్లాపూర్‌లోని ప్రభుత్వ ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. కోర్టులు అందించే న్యాయ సేవలు, మహిళలకు సంబంధించిన చట్టాల గూర్చి వివరించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, లోక్ అదాలత్ సభ్యులు మోహన్‌లాల్, న్యాయవాది మధుసూదన్‌రావు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కవిత ఉపాధ్యాయులు ఉన్నారు.

యూడైస్‌పై అవగాహన



తెలకపల్లి: యూడైస్‌లో డాటా క్యాప్చర్ ఫార్మాట్ 2024–25 పాఠశాలకు సంబంధించిన పూర్తి సమగ్ర సమాచారాన్ని అంతర్జాలంలో నమోదు చేయాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ నవంబర్ 19న నిర్వహించే 3వ, 6వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే మ్యాథ్స్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని సూచించారు. నోడల్ అధికారి శ్రీనివాసులు, రాజశేఖర్ రావు, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, సుఖజీవన్ రెడ్డి, శ్రీనివాసులు, నరహరి పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని మర్రిపల్లి వద్ద ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాసమగ్ర సమాచారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్ రెడ్డి, నోడల్ అధికారి రూనీస్రాణి, హెచ్‌ఎంలు, సీఆర్పీ యాదయ్య, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు షీటీంపై..

కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బా, గురుకుల, మాడల్ స్కూల్‌లో షీటీంపై బుధవారం జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోకారి, శ్రీలత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతపై నిర్లక్ష్యం వద్దు

లింగాల: విద్యార్థినులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందుజాగ్రత్తలు చేపట్టాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి అన్నారు. లింగాలలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థినుల హాజరు శాతం, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీటీడీఓ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పాఠశాల శుభ్రతపై నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. హెచ్‌ఎం మంగమ్మ ఉన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పంప్‌హౌస్ మునక

నాగర్‌కర్నూల్‌రూరల్: మెగా కంపెనీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా వట్టెం రిజర్వాయర్ పంప్‌హౌస్ నీట మునిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు ఆరోపించారు. బుధవారం సీపీఎం బృందం శ్రీపురం వద్ద టర్నెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ ప్యాకేజీ పనులు చేస్తున్న మెగా కంపెనీ యాజమాన్యం పర్యవేక్షణ లేకపోవడంతో శ్రీపురం టర్నెల్‌లోకి వర్షపు నీరు చేరిందని వాపోయారు. కందికొండ గీత, అశోక్, మధు, తారాసింగ్, శివరాం పాల్గొన్నారు.